క్లుప్తంగా

చురుగ్గా డ్రైనేజీ నిర్మాణ పనులు


నారాయుడుపాలెంలో డ్రైనేజీ నిర్మాణ పనులు

మునగపాక: మండలంలోని నారాయుడుపాలెంలో డ్రైనేజీ నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. గ్రామంలో కాలువలు లేక గ్రామస్తులు అవస్థలు పడుతున్నారు. ఏ కొద్ది పాటి వర్షం కురిసినా నీరంతా రోడ్డుపై ఉండిపోవడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ సమస్యను స్థానికులు జెడ్పీటీసీ సభ్యుడు పెంటకోట స్వామి సత్యనారాయణ దృష్టికి తీసుకువచ్చారు. దీంతో రూ.5 లక్షల జిల్లా పరిషత్ నిధులను కాలువ నిర్మాణానికి కేటాయించారు. కొద్ది రోజులుగా ఈ పనులు చురుగ్గా సాగుతున్నాయి. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆలయ నిర్మాణంలో భాగస్వాములు కావాలి


మండప నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న తోటాడ సర్పంచ్ మంగవేణి

మునగపాక: ప్రతి ఒక్కరూ మరిడిమాంబ ఆలయ అభివృద్ధికి సహకరించాలని తోటాడ సర్పంచ్ దొడ్డి మంగవేణి కోరారు. మండలంలోని తోటాడ-గవర్ల అనకాపల్లి గ్రామాల పరిధిలో నిర్మిస్తున్న మరిడిమాంబ ఆలయానికి అనుగుణంగా మండప నిర్మాణానికి శుక్రవారం ఆమె భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తోటాడ పంచాయతీ ప్రజలంతా ఆలయ నిర్మాణంలో భాగస్వాములు కావాలన్నారు. ఎంపీటీసీ కాండ్రేగుల వెంకటలక్ష్మి, పెద్దలు ఎంవీఆర్ నాయుడు, దాడి శ్రీనివాసరావు, పొలమరశెట్టి నాగేశ్వరరావు, పార్థసారథి, ఆళ్ల సాంబశివ, పొలమరశెట్టి ఆనంద్, రాపేటి పరమేష్, బొడ్డేడ శ్రీను, సుధాకర్, గంగాజీ, చిన్నప్పనాయుడు, జగదీష్, అనిల్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

అప్పన్నను దర్శించుకున్న కేంద్రప్రభుత్వ కార్యదర్శులు


అప్పన్న ఆలయంలో కేంద్ర ప్రభుత్వ కార్యదర్శులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని కేంద్ర న్యాయశాఖ, న్యాయ వ్యవహారాల విభాగం కార్యదర్శి డాక్టర్ అంజు రతిరాణా, కేంద్ర కార్పొరేట్ వ్యవహారాల శాఖ కార్యదర్శి దీప్తి ముఖర్జీ శుక్రవారం దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకుని బేడామండపంలో ప్రదక్షిణ చేశారు. అంతరాలయంలో అర్చకులు వారి పేరిట ప్రత్యేక పూజలు జరిపారు. వేద ఆశీర్వచనం అనంతరం ఆలయ సాంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదం, శేషవస్త్రంలను ఆలయ ఏఈవో తిరుమలేశ్వరరావు అందించారు.

ఎన్టీపీసీ ఉద్యోగులకు క్విజ్ పోటీలు

పరవాడ: ఎన్టీపీసీ సింహాద్రి ఆధ్వర్యంలో ప్రాంతీయ స్థాయి 4వ మేధా ప్రతియోగిత పవర్ క్విజ్ పోటీలను సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సమీర్‌శర్మ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జ్ఞానాన్ని పెంపొందించుకునేందుకు ఈ పోటీలు అనేక విధాలుగా దోహదపడతాయన్నారు. దక్షిణ ప్రాంత ప్రధాన కార్యాలయాలతో పాటు వివిధ ఎన్టీపీసీ దక్షిణ ప్రాజెక్టులకు ప్రాతినిధ్యం వహిస్తున్న 6 జట్లు 4 విభాగాల్లో పోటీపడ్డాయి. ఈ పోటీలు కేవలం ఉద్యోగ వర్గానికి చెందినవేనన్నారు. ఇందులో విజేతలైనవారు జాతీయ స్థాయి మేధా క్విజ్ పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఆర్ హెడ్ బీబీ పాత్ర, క్విజ్ మాస్టర్ గౌతమ్ బోస్, సంస్థ సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యంపై ఫిర్యాదు


గెంజి రాజు

పరవాడ: స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలోని సాలాపువానిపాలేనికి చెందిన గెంజి రాజు(45) ఈ నెల 3 నుంచి కనిపించడం లేదని అతని బంధువులు శుక్రవారం ఫిర్యాదు చేసినట్లు పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు చెప్పారు. వివరాలివి. ఆటో డ్రైవర్ రాజు ఈ నెల 3న ఉదయం 6 గంటలకు ఇంటి నుంచి బయల్దేరి, ఎంతకీ ఇంటికి చేరుకోలేదు. ఆటో ఇంటి పక్కనే పార్క్ చేసి ఉంది. రాజు ఆచూకీ కోసం బంధువులు, స్నేహితులు, తెలిసిన వ్యక్తులను రెండు రోజులుగా వాకబు చేసినా ఫలితం లేకపోవడంతో అతని బంధువులు పోలీసులనాశ్రయించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

డ్రైవర్‌కు గాయాలు

మాడుగుల రూరల్: మండలంలో కె.జె.పురం నుంచి అప్పలరాజుపురం వెళ్లే రహదారిలో ఆటో, బస్సు ఢీకొన్న ఘటనలో ఆటో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. పాడేరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు శుక్రవారం సాయంత్రం చోడవరం నుంచి అప్పలరాజుపురం మెట్ట సమీపంలోకి వచ్చేసరికి కె.జె.పురానికి చెందిన షేక్ బాబ్జి తన ఆటోను మరమ్మతులకు తీసుకెళ్తుండగా మలుపు వద్ద ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఆటో నుజ్జునుజ్జు అయింది.

చూడి పశువు సంరక్షణ.. ప్రత్యేక శ్రద్ధ

- 7వ నెల తర్వాత పాలు పితకొద్దు
- చివరి రెండు నెలల్లో దాణా పెంచాలి
- పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ


చూడి పశువు

కోటవురట్ల: పాడిపంట రైతుకు రెండు కళ్లలాంటివి. పంటల సాగు ప్రకృతి అనుకూలతపై ఆధారపడి ఉండగా, పాడి మాత్రం కాస్త శ్రద్ధ వహిస్తే చాలు లాభాలు వచ్చిపడతాయి. ప్రధానంగా పశువుల సంరక్షణ, సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన ఉంటే చాలు. చూడి పశువు సంరక్షణలో తగిన జాగ్రత్తలు పాటిస్తే మేలైన దూడ పుట్టడమే కాకుండా మంచి పాల దిగుబడి వచ్చే అవకాశం ఉంటుంది. చూడి పశువు సంరక్షణలో అవలంబించాల్సిన జాగ్రత్తలను పశు సంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బి.ఎన్.వి.లక్ష్మీనారాయణ వివరించారు.

చూడి పశువు సంరక్షణ ఇలా...

పశువు గర్భం దాల్చిన నాటి నుంచి చూడి పశువుకు, గర్భంలో పెరుగుతున్న దూడకు సంరక్షణ అవసరం. గర్భ కాలంలో మొదటి కొద్ది నెలలో పెరిగిన దాని కంటే చివరి రెండు నెలలో నాలుగు రెట్లు వేగంగా దూడ పెరుగుతుంది. అందువల్ల చూడి పశువుల సంరక్షణలో జాగ్రత్తలు చాలా అవసరం. చూడి చివరి రెండు నెలలో దాణాను పెంచడంతో పాటు పప్పు జాతికి చెందిన గడ్డి రూపంలో అధిక పోషకాలను అందించాలి. ఇలా చేయడం వల్ల దూడ పెరుగుదలకే కాకుండా పశువు ఈనిన వెంటనే పాల ఉత్పత్తి పెరుగుతుంది. చూడి పశువు ఈనే వరకు పాలు తియ్యటం మంచిది కాదు. ఈనడానికి రెండు నెలల ముందు(7వ నెల) నుంచి పాలను తీయడం మానేయాలి. అలా చేస్తే ఈత తర్వాత పాల ఉత్పత్తి తగ్గదు. పుట్టిన దూడకు పొట్టలో పురుగులు, నట్టల సమస్య లేకుండా చూడి చివరి మూడు నెలల్లో చూడి పశువుకు పురుగులను నిర్మూలించేలా మందు వెయ్యాలి. పాలు పితకడం ఆపిన తర్వాతి కాలంలో చూడి పశువు బరువు గణనీయంగా పెరిగేలా చూడాలి. చివరి రెండు నెలల్లో 45-60 కిలోల బరువు పెరగాలి.

ఈతకు ముందు జాగ్రత్తలు..

ఈతకు ముందు ఆవు శరీరంలో, ప్రవర్తనలో స్వల్ప మార్పులు వస్తాయి. ఈనడానికి రెండు వారాల ముందు పొదుగు పెద్దగా అవుతుంది. కొన్ని సందర్భాలలో పొదుగు నుంచి పాలు కారుతుంటాయి. మానం ఉబ్బి తెల్లటి ద్రవం కారుతుంటుంది. పెల్విక్ లిగమెంట్లు వదులుగా అవుతాయి. పశువు ఆందోళనగా ఉండి సక్రమంగా మేయదు. ఈ సమయంలో పశువు ఈనడానికి అవసరమైన వాతావరణాన్ని కల్పించాలి. ఈతకి వారం ముందు చూడి పశువును మిగిలిన పశువుల నుంచి వేరు చేసి పొడిగా, శుభ్రంగా, ప్రశాంతంగా ఉండే కొట్టాంలో కట్టాలి. పొడిగా ఉండేలా ఎండుగడ్డితో పక్క వేయాలి.

ఈనికలో ఇబ్బందులుంటే వైద్యులకు చూపించాలి

ఎక్కువ పాల దిగుబడినిచ్చే పశువులలో ఈనిన వెంటనే పాల జ్వరం రాకుండా చూలుతో ఉన్న సమయంలో కాల్షియం, ఖనిజ, లవణాలు సమృద్ధి గా ఇవ్వాలి. ఈనడానికి ఒక వారం ముందు విటమిన్ డి ఇంజక్షన్ వేయించాలి. నీటి సంచి కనిపించిన రెండు గంటలకు దూడ కాళ్లు బయటకు రాకపోతే వెంటనే వైద్యుని సంప్రదించాలి. దూడ కాళ్లు కనబడిన అర గంట తర్వాత కూడా ఎటువంటి మార్పు కనబడకపోతే వెంటనే సంప్రదించాలి. రెండు కాళ్లకు బదులు ఒక కాలు మాత్రమే బయట కనబడినా డాక్టరుకు చూపించాలి. ఈనిన 24 గంటలలోపు మాయ పడకపోయినా వైద్యునికి చూపించాలి.

దిమిలి-మర్రిపాలెం రహదారి గోతులమయం


భారీ వర్షం పడినప్పుడు ప్రమాదాలు కారణమవుతున్న గోతులు

రాంబిల్లి(అచ్యుతాపురం): రాంబిల్లి మండలంలోని కొన్ని మారుమూల గ్రామాల్లో రహదారుల కష్టాలు వెంటాడుతూనే ఉన్నాయి. నేవల్ బేస్ వచ్చిన తర్వాత దేశంలోనే ఈ ప్రాంతం అత్యంత కీలకంగా మారింది. మరోవైపు సెజ్ కంపెనీల ఏర్పాటుతో నిత్యం రాకపోకలు సాగుతున్నాయి. ఈ క్రమంలో కొన్ని ప్రధాన రహదారులు మెరుగుపడినప్పటికీ ఆయా కంపెనీలు, మండల కేంద్రానికి చేరుకునేందుకు మిగిలిన ప్రజలు అవస్థలు పడాల్సి వస్తోంది. ఈ క్రమంలో ఆరు కిలోమీటర్ల పరిధి గల దిమిలి మర్రిపాలెం రోడ్డు వాహన చోదకుల్ని పరీక్షిస్తుంది. దిమిలి మణికంఠ క్షేత్రం వద్ద వర్షం పడితే కనిపించని భారీ గోతులతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. కట్టబోలు గ్రామ ప్రారంభంలో కొండరోడ్డు పక్కన తీవ్ర గోతులమయంగా మారింది. మర్రిపాలెం వెళ్లే దారి సైతం మరింత ప్రమాదకరంగా మారిన నేపథ్యంలో ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి ఆయా మార్గంలో మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

డ్రోన్‌తో ఎరువులు వినియోగించండి


డ్రోన్ విధానంతో ఎరువులు వినియోగం వివరిస్తున్న వ్యవసాయాధికారులు

ఎస్.రాయవరం: డ్రోన్ సహాయంతో పంటకు ఎరువులు అందిస్తే, సమయం ఆదాతోపాటు ఖర్చు తగ్గుతుందని మండల వ్యవసాయాధికారి సౌజన్య తెలిపారు. శుక్రవారం ఉప్పరాపల్లిలో డ్రోన్ సహాయంతో వరి చేనుకు యూరియా పిచికారీ చేశారు. అతి తక్కువ సమయంలో ఎకరాలు మేర పంటకు అనుకున్న విధంగా యూరియా అందించామన్నారు. కార్యక్రమంలో ఎస్.రాయవరం పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి టి. నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకుడు పిట్ల నాయుడు, రైతులు పాల్గొన్నారు.

బల్క్ డ్రగ్ పార్కుకు వ్యతిరేకంగా ర్యాలీ


రాజయ్యపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న ఐద్వా నాయకులు

నక్కపల్లి: మండలంలోని రాజయ్యపేట సమీపంలో ఏర్పాటు చేస్తున్న బల్క్ డ్రగ్ పార్క్ రద్దు చేయాలంటూ శుక్రవారం ఐద్వా ఆధ్వర్యంలో మహిళలతో ర్యాలీ నిర్వహించారు. ఐద్వా జిల్లా అధ్యక్షురాలు డీడీ వరలక్ష్మి మాట్లాడుతూ ఇప్పటికే ఏర్పాటు చేసిన హెటిరో డ్రగ్స్ పరిశ్రమ వల్ల తీర ప్రాంతాల ప్రజలు అనేక రుగ్మతలతో బాధపడుతున్నారని వాపోయారు. తాజాగా బల్క్ డ్రగ్ పేరుతో పదుల సంఖ్యలో రసాయన పరిశ్రమలు ఏర్పాటు చేసి ప్రజల ప్రాణాలను నాశనం చేయాలని కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. కాకినాడ జిల్లా తొండంగి మండలంలో ఏర్పాటు చేయడానికి ప్రయత్నిస్తే, అక్కడ ప్రజలు తీవ్రంగా వ్యతిరేకించారన్నారు. నాడు తెలుగుదేశం పార్టీ నాయకులు యనమల రామకృష్ణుడు, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ సైతం అక్కడ ఏర్పాటు చేయాలని తలపెట్టిన బల్క్‌డ్రగ్ పార్క్‌ను తీవ్రంగా వ్యతిరేకిస్తూ ఆందోళన చేశారన్నారు. అదే బల్క్‌డ్రగ్ పార్క్‌ను రాజయ్యపేటలో ఏర్పాటు చేస్తుంటే వీరు ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. ఈ ప్రాంత ప్రజల ప్రాణాలు పోయినా పర్వాలేదా అని నిలదీశారు. ప్రాంతాల మధ్య వ్యత్యాసం చూపడం దారుణమన్నారు. బల్క్ డ్రగ్‌పార్క్ రద్దు చేసే వరకు పోరాటం ఆగదన్నారు. కార్యక్రమంలో నాగమణి, చంద్రకళ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మిలాద్ ఉన్ నబీ


ఉరుసు ఉత్సవంలో పాల్గొన్న ముస్లింలు

నక్కపల్లి: మండలంలో ఈద్ మిలాద్ ఉన్ నబీ పండగను ముస్లింలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మసీదుల వద్ద ప్రార్థనలు చేశారు. అనంతరం ఉరుసు ఉత్సవంలో భాగంగా పతాకాలను పట్టుకుని ఊరేగింపు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు వీసం రామకృష్ణ, ఉమర్, కాలీసా, సర్పంచ్ ముస్సీసా, నాయకులు లక్ష్మణరావు, శ్రీనువాసరావు పాల్గొన్నారు.

గణపయ్యా.. దీవించయ్యా

పలుచోట్ల నిమజ్జనాల కోలాహలం


కట్టబోలులో గణనాథున్ని ఊరేగిస్తున్న దృశ్యం


హోమంలో సర్పంచ్ ధనలక్ష్మి నాగప్పారావు దంపతులు


నిమజ్జనోత్సవంలో భాగంగా కోలాటం ప్రదర్శిస్తున్న చిన్నారులు

యలమంచిలి రూరల్: మండలం, పట్టణంలోని గ్రామాలు, కాలనీల్లో గణేష్ నిమజ్జనాల కోలాహలం నెలకొంది. నవరాత్రుల ఉత్సవాలు ముగింపు దశకు చేరుకోవడంతో పట్టణంలోని వినాయక మండపాల వద్ద భక్తుల సందడి పెరిగింది. శుక్రవారం రాత్రి పలుచోట్ల నిమజ్జనాలకు యువకులు, మహిళలు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. దీంతో పట్టణంలో ప్రధాన రహదారులపై కోలాహలం కనిపించింది. మధ్యాహ్నం పట్టణంలోని రైల్వేస్టేషన్ రోడ్డు సౌభాగ్య అపార్టుమెంట్ పక్కన మండప నిర్వాహకులు నాలుగు వేల మందికి అన్న ప్రసాద వితరణ ఏర్పాటు చేశారు. రాంనగర్‌లో బాలగణపతి మండపం వద్ద భారీ అన్నప్రసాద వితరణ నిర్వహించారు. మరోవైపు మండలంలోని పులపర్తి, కొత్తలి, బయ్యవరం తదితర గ్రామాల్లో గణనాథుని ప్రతిమలు భారీ ఊరేగింపు నడుమ నిమజ్జనానికి తరలివెళ్లాయి. ఆదివారం చంద్రగ్రహణం ఉండడంతో శనివారం మిగిలిన విగ్రహాలు నిమజ్జనానికి తరలి వెళ్లనున్నాయి. యలమంచిలి పట్టణం, రూరల్ పోలీసులు నిమజ్జనాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహిస్తున్నారు.

ఘనంగా వినాయక నిమజ్జనాలు

మునగపాక: మండల వ్యాప్తంగా వినాయక నవరాత్రి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. పలు చోట్ల భారీ అన్న సమారాధనలు, నిమజ్జనాలతో గ్రామాల్లో సందడి వాతావరణం కనిపిస్తోంది. దీనిలో భాగంగా మండలంలోని టి.సిరసపల్లిలో సర్పంచ్ మద్దాల ధనలక్ష్మి నాగప్పారావు దంపతుల ఆధ్వర్యంలో శుక్రవారం హోమం నిర్వహించారు. పలువురు భక్తులు పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నసమారాధనకు భక్తులు భారీగా తరలివచ్చారు.

రాంబిల్లి(అచ్యుతాపురం): వినాయక నవరాత్రి మహోత్సవాలు ఘనంగా సాగుతున్నాయి. రాంబిల్లి మండలంలోని పలు గ్రామాల్లో గురు, శుక్రవారాలు వినాయక అనుపు మహోత్సవాలు, అన్న సమారాధన కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. కట్టబోలులో భారీ అన్న సమారాధన నిర్వహించారు. రాత్రికి నిమజ్జనోత్సవ ఊరేగింపు చేపట్టారు. కుమ్మరాపల్లికి చెందిన బాలికల కోలాటాలు, జానపద నృత్యాలు ఆకట్టుకున్నాయి.

ఘనంగా గురుపూజోత్సవం


చినదొడ్డిగల్లులో గురుపూజోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం


ఉపాధ్యాయురాలిగా ఎంపికైన సరోజిని దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

అవార్డు గ్రహీతలకు సన్మానం


కోటవురట్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురుపూజోత్సవం

నక్కపల్లి: గురు పూజోత్సవాన్ని శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. చినదొడ్డిగల్లు జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు ఉపాధ్యాయుల అవతారమెత్తి ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా హెచ్ఎం బాలాజీ మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి ఎంతో కీలకమైందన్నారు. విద్యార్థులను భావి భారత పౌరులుగా ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దే గురుతర బాధ్యత వారిపై ఉందన్నారు. సాధారణ ఉపాధ్యాయుడి నుంచి దేశంలో అత్యున్నత పదవి అయిన రాష్ట్రపతిగా ఎంపికైన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జయంతిని ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకోవడం గర్వంగా ఉందన్నారు. అంకితభావంతో పనిచేసే ఉపాధ్యాయులు సమాజంలో గుర్తింపు పొందుతారన్నారు. మండలంలో డీఆర్‌కే శాస్త్రి, కే సత్యవతి, కాళింగ సతీష్ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. వీరిని ఆయా పాఠశాలల సహచర సిబ్బంది అభినందించారు. జిల్లా కేంద్రం అనకాపల్లిలో అవార్డు గ్రహీతలను మంత్రి, కలెక్టర్ ఘనంగా సత్కరించి జ్ఞాపికలు అందజేశారు.

మునగపాక: స్థానిక నేషనల్ జూనియర్ కళాశాలలో శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను విద్యార్థులు ఘనంగా సత్కరించారు. ఫ్రెషర్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా ఇదే కళాశాలలో చదువుకుని డీఎస్సీ ఫలితాల్లో ఎంపికైన సరోజిని దంపతులను ఘనంగా సత్కరించారు. ప్రిన్సిపాల్ కె.ఈశ్వరరావు, కరస్పాండెంట్ బొడ్డేడ మహేష్, ఆడారి సతీష్, వేగి వీరునాయుడు, వేగి శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు బీఆర్ శంకరరావు, ఎస్ఎం ప్రసాద్, కే సంజీవరావు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

కోటవురట్ల: మండలంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు పాఠశాలల్లో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. స్థానిక పీఎంశ్రీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఇన్‌చార్జ్ హెచ్ఎం సుకుమార్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని జరిపారు. ఈ సందర్భంగా సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆటలాడారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. గురువులను శాలువాతో సత్కరించి ప్రణమిల్లారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బి.ఎస్.ప్రసాద్, కృష్ణ, లక్ష్మీనరసింహ, నాగేశ్వరరావు, రాజీవ్, వెంకటరత్నం, రమణ, లావణ్య, షకీలా, రమణమూర్తి, రాములమ్మ, కిషోర్ పాల్గొన్నారు.

యాంత్రీకరణ లేని రోజుల్లో ఎన్నో అద్భుతాలు



ఎన్‌సీసీ విద్యార్థులతో ఎమ్మెల్యే సుందరపు, జాతీయ పరిశోధన అభివృద్ధి సంస్థ హెడ్ విజయ్‌కుమార్ సాహూ

జాతీయ పరిశోధన అభివృద్ధి సంస్థ హెడ్ డాక్టర్ విజయ్‌కుమార్ సాహూ

అచ్యుతాపురం రూరల్: యాంత్రీకరణ లేని రోజుల్లో దేశంలో ఎన్నో అద్భుతాలు సృష్టించి మానవ జీవన శైలిని కొనసాగించారని జాతీయ పరిశోధన అభివృద్ధి సంస్థ హెడ్ డాక్టర్ విజయ్ కుమార్ సాహూ తెలిపారు. కరస్పాండెంట్ ధర్మిరెడ్డి ప్రసాద్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ప్రశాంతి పాలిటెక్నిక్ కళాశాలలో సైన్స్ అండ్ ఇండిజీనియస్ టెక్నాలజీ ఆన్ వీల్స్ ప్రాజెక్ట్‌ను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ విజయ్ కుమార్ సాహూ హాజరై మాట్లాడారు. దేశంలో సాంకేతిక, సంస్కృతీ సంప్రదాయాలకు కొదవలేదన్నారు. వివిధ మూలికలను ఉపయోగించి ఆయుర్వేదిక మందులను తయారు చేసి ఎటువంటి వ్యాధులనైనా నయం చేసేవారన్నారు. ఇటువంటి ఎంతో విలువైన చరిత్ర గల భారతదేశం ప్రస్తుతం అభివృద్ధి చెందుతున్న సాంకేతికతకు మూలం అన్నారు. మన ప్రాచీన గ్రంథాలు అవశేషాలను మరిచిపోతున్నారన్నారు. ప్రతి ఒక్కరూ విద్యార్థి దశ నుంచే తెలుసుకోవడానికి కేంద్ర ప్రభుత్వం వికసిత్ భారతలో భాగంగా ఈ కార్యక్రమం ద్వారా అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ మాట్లాడుతూ భారతదేశపు మూలాలను మర్చిపోకూడదని తెలిపారు. కార్యక్రమంలో గొర్లి మహేశ్వర్రావు డిప్యూటీ డైరెక్టర్ మై భారత్, ధర్మిరెడ్డి అప్పలనాయుడు, ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

బొలెరో వాహనం ఢీకొని ఇద్దరికి గాయాలు


ప్రమాదంలో గాయపడిన యువకులు

బుచ్చెయ్యపేట: కొండెంపూడిలో శుక్రవారం సాయంత్రం బొలెరో వాహనాన్ని ఢీకొని ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. బుచ్చెయ్యపేటకి చెందిన కోమార చిరంజీవి, నరేంద్ర బైక్‌పై రావికమతం వెళ్లి గణనాథుడి అలంకరణ కోసం పూలదండలు తీసుకుని వస్తుండగా కొండెంపూడి వద్ద ఈ ప్రమాదం జరిగింది. చిరంజీవి తలకు తీవ్ర, నరేంద్రకు స్వల్ప గాయాలయ్యాయి.

ఎరువుల దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు


పరవాడలో ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేసిన తహసీల్దార్ నాగరాజు, వ్యవసాయాధికారి రమాదేవి


నాయుడుపాలెం రైతు సేవా కేంద్రాన్ని తనిఖీ చేసిన అధికారులు

పరవాడ: కలెక్టర్ విజయ కృష్ణన్ ఆదేశాల మేరకు పరవాడ తహసీల్దార్ బి.నాగరాజు, ఏవో రమాదేవి తమ సిబ్బందితో ఎరువుల దుకాణాలు, రైతు సేవా కేంద్రాలను శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. పరవాడలోని మూడు ఎరువుల దుకాణాలను తనిఖీ చేసి, ఎరువుల నిల్వలకు సంబంధించి రికార్డులను పరిశీలించారు. పెదముషిడివాడ, నాయుడుపాలెం గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాలను సందర్శించి అక్కడ ఎరువుల నిల్వల వివరాలను అడిగి తెలుసుకున్నారు. నాయుడుపాలెం, పెదముషిడివాడ రైతు సేవా కేంద్రాల్లో 9.345 టన్నుల యూరియా, ప్రైవేట్ ఎరువుల దుకాణాల వద్ద 11.249 టన్నుల ఎరువులు ఉన్నట్లు గుర్తించారు. వీఆర్వోలు, వీఆర్ఏలు, సిబ్బంది పాల్గొన్నారు.

బ్రిటిష్ సమాధుల స్థలంలో కట్టడాలను తొలగించాలి

నర్సీపట్నం: నర్సీపట్నంలోని సర్వే నంబరు 9లో బ్రిటిష్ సమాధుల స్థలంలో అక్రమ కట్టడాలను తొలగించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ మున్సిపల్ అధికారులు, తహసీల్దార్, ఆర్డీవో లాంటి ఉన్నతాధికారులున్న ప్రాంతంలోనే ప్రభుత్వ స్థలాలు ఆక్రమించుకున్న వారికి అనుకూలంగా మాట్లాడటం దారుణమన్నారు. కొత్తగా నిర్మాణాలు చేపడితే వాటిని తొలగించాలని కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను ధిక్కరిస్తూ అక్రమ కట్టడాలను ప్రోత్సహిస్తున్నారన్నారు. అల్లూరి పోరాట స్ఫూర్తిగా ఉన్న ప్రాంతంలో అక్రమ కట్టడాలు జరుగుతూ ఉంటే చోద్యం చూస్తున్నారని మండిపడ్డారు. బతుకుదెరువు కోసం రోడ్డు పక్కన చిన్న దుకాణం పెట్టుకుంటే తొలగిస్తున్న మున్సిపల్ అధికారులు ఒకేచోట ప్రభుత్వ స్థలం ఉన్న ప్రాంతంలో షాపింగ్ మాల్ కడుతూ ఉంటే ఎందుకు చర్య తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా కోర్టు ఉత్తర్వులు అమలు చేసి అక్రమ కట్టడాలను తొలగించకపోతే బాధ్యులపై కోర్టు ధిక్కరణ కేసు వేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి అడిగర్ల రాజు, పి.చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.